# ఏమంటావ్ బావా



— సాహితి

**పార్కులో చెట్టు కింద బెంచీ మీద కూర్చున్నారిద్దరూనూ. చాలా సేపైంది వచ్చి. మాట్లాడబోతే అతనికేమో మాటలు దొరకడం లేదు. ఏదో చెప్పాలని ఇంతదాకా తీసుకొచ్చి ఇంకా నోరు మెదపడేమిటని ఆమె కాస్తంత అసహనంగా చూస్తోంది. పక్షులు గూళ్ళు చేరే వేళ.**

చెట్టు మీదంతా కలకలంగా ఉంది. ఒకటే గోలగా ఉంది. ఎక్కడెక్కడి పక్షులు వచ్చి చెట్టు మీద వాలుతున్నాయి. అలా వాలి ఒకచోట కుదురుగా ఉండడం లేదు. ఓ కొమ్మ మీంచీ మరో కొమ్మ మీదికి గెంతుతున్నాయి. ఒకదాని పక్క నుంచీ వచ్చి మరో దాని పక్కన వాలుతున్నాయి. వీటికీ స్నేహాలవీ ఉంటాయా? అనుకుంటుంటే సరిగ్గా అతనూ అప్పుడే ఏదో చెప్పబోతున్నట్టు పెదాలు కదిపాడు.

ఏదో చెప్తాడనుకుని, "ఏమిటీ?" అంది. నిజానికతనింకా ఏమీ చెప్పలేదుగానీ ఆమె వేసిన ఆ ప్రశ్నతో ఇద్దరి మధ్యా ఘనీభవించిన మౌనం ఫెళ్ళుమని బ్రద్దలైంది. ఇహ మీదట అన్నీ మాటలే!

"సారీ జయా! ఇలా చెప్పాల్సొస్తుందనుకోలేదు. మనం ఒకళ్ల నొకళ్ళు మరిచిపోవడం మంచిదేమో" సూటిగా ఆమె మొహంకేసి చూడలేక ఎటో చూస్తూ అన్నాడు.

ఊహించని ఆ విషయానికి ఆమె ఉద్రేకపడింది. ఏకంగా పిడుగు నెత్తిమీదపడితే ఒక్కసారి ఠపీమని చచ్చూరుకోవచ్చు. అంతటితో ఛాప్టర్ క్లోజ్. కానీ ఇది అలాంటిది కాదు. ముందుగా ఊహించనిది ఆపైన స్లోపాయిజన్ లాంటిది. ఒక్కోసారి తనని తినెయ్యదు. అంచెలంచెలుగా ఆ పని చేస్తుంది.

"ఏం? ఎందుకని? ఎందుకని అడుగుతున్నాను. ఇన్నాళ్ళు ఇద్దరం కలిసి తిరిగాము. పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. ఇంతలో ఎందుకీ మార్పు?" గట్టిగా అడిగింది.

"ప్లీజ్... నన్నా వివరాలేవీ అడక్కు."

"ఎందుకడగద్దు? నా కన్నా అందమైన అమ్మాయి నీక్కనిపించిందా?" లేకపోతే బోల్డు కట్నంతో మీ నాన్న నీకు పెళ్ళి సంబంధం తీసుకొచ్చాడా?" ఎవర్నీ ఎప్పుడూ ఏదీ గట్టిగా అడగలేదేమో ఆమెకి ఏడుపొచ్చేస్తోంది. అతని ముందు బైటపడరాదని బిగపట్టుకుంది.

అసలామెకి ఏమీ చెప్పకూడదనుకున్నాడు ముందు. సారీయేనా చెప్పడం. కనీస స్నేహ ధర్మం అనుకున్నాడు తర్వాత. ఇప్పుడామె నిందిస్తోంటే అసలు విషయాన్ని కక్కేసాడు.

"మీ బావ నిన్ను చేసుకుందామనుకుంటున్నాడటగా? నీకూ ఇష్టమేనటగా? ఇప్పుడు చెప్పు. నీ ఉద్దేశం మరోలా ఉన్నప్పుడు నాతో ఇలాంటి గేమ్ ఎందుకాడావు?" ఈసారి ఆమెకేసి తిరగడానికి అతనికి బోలెడు ధైర్యం వచ్చేసింది.

"ఎవరు చెప్పారు?"

"మీ అక్కయ్య!"

"ఎప్పుడు?"

"నిన్న!"

"నిన్న మీ ఇద్దరూ ఎప్పుడు మాట్లాడుకున్నారు? నువ్వసలు ఇంట్లోకే రాలేదుగా?"

"నిన్ను మీ ఇంటి దగ్గర డ్రాప్ చేశాను. నువ్వు వెంటనే లోపలికెళ్ళిపోయావు. పెరటి వైపు నుంచీ మీ అక్కయ్య ఇవతలి కొచ్చింది... చెప్పింది..."

"ఆ రోడ్డు మీదా? ఏమని?"

"ఓ కుటుంబంలో వాళ్లలా కలిసిపోయి ఉందామని నిర్ణయించుకున్నాం. అదీ ఈ పెళ్ళికొప్పుకుంది. మాకూ సమ్మతమైంది. మరి ఈ తిరుగుళ్లవీ సబబేనా అనడిగింది."

"మా అక్కయ్యా?" నమ్మలేకపోతోంది జయ. అంతదాకా ఉగ్గబట్టుకున్న ఏడుపు ఎగదన్నుకొచ్చింది. చేతుల్లో మొహం కప్పుకుని నిస్సహాయంగా ఏడ్చింది. దగ్గరికి తీసుకుని ఓదార్చాలని చెయ్యి చాపాడతను. అంతలోనే మళ్ళీ చెయ్యి వెనక్కి తీసేసుకున్నాడు.

ఆ ఏడుపుతో జయ మనస్సులో ఉన్న ఆందోళన, చిరాకు, ఉద్రేకం అన్నీ కొట్టుకుపోయాయి. అక్క చెళ్ళెళ్ళిద్దరూ పంచుకున్న మధురమైన అనుభూతులు కూడా కొట్టుకుపోయాయి. కటువైన జీవిత సత్యాలు, వాటి విలువలూ మాత్రం మిగిలాయి. ఆ విలువల్ని ఎలాగైనా సరే నిలబెట్టుకోవాలన్న పట్టుదల వచ్చింది.

జయ తల్లీ తండ్రీ పదకొండు నెలల తేడాతో గతించారు. వాళ్ళకి ముగ్గురు సంతానం. పెద్దది పరిమళ. రెండోది జయ. తరువాత ప్రకాష్. తండ్రి ఉద్యోగంలో ఉండగానే పరిమళ పెళ్ళైపోయింది. తరువాత ఆయన రిటైరైపోయాడు. రిటైర్మెంట్ డబ్బుతో కూతురి పెళ్ళికి చేసిన అప్పులు తీర్చి, జయ పెళ్ళి కూడా కానిచ్చేద్దామనుకునేంతలో హార్టెటాకొచ్చిపోయాడు. ఆయన పోయిన పదకొండు నెలలకే భార్యా పోయింది. దిక్కులేని పక్షు

ల్లా మిగిలిపోయారు జయ, ప్రకామను. వాళ్లని చేరదీసి ఆశ్రయం ఇచ్చాడు. పరిమళ భర్త చెలం అప్పుడతని మనసులో ఏమీ లేదు. జయ పేర కాస్తో కూస్తో డబ్బుంది. ఏదో చిన్నపాటి సంబంధం చూసి చేసెయ్యొచ్చు. పోతే ప్రకాష్ - వాడికి పాతికేళ్ళో, ఉద్యోగమో వచ్చేదాకా పెన్షనొస్తుంది. వాడివల్ల నష్టమేం లేదు. పైగా నలుగుర్లో పేరు కూడాను

భర్త కంత మంచి హృదయం ఉన్నందుకు పరిమళ కూడా ఎంతో సంతోషించింది. అయితే ఇవన్నీ జయకి ఉద్యోగం రాక ముందు వరకే సరదాకి రాసిన ఎల్ఐసి టెస్టు పాసై జయకి ఉద్యోగం వచ్చింది. ఇంట్లోవాళ్ళ మనస్తత్వాల్లో మార్పొచ్చింది.

ఇవన్నీ కళ్ళ ముందు సినిమా రీల్లా కదిలాయి జయకి. తను పట్టించుకోవడంలేదు గానీ, బావలో చాలా మార్పొచ్చింది. అదివరకూ అతన్ని చూస్తుంటే తన తండ్రినో అన్ననో చూస్తున్నట్టుండేది. ఇప్పుడు కచ్చితంగా అక్క మొగుడిలాగానే కనిపిస్తున్నాడు. అక్క కూడా మారింది. స్తబ్దుగా తయారైంది. అతన్ని తప్పుకు తిరుగుతోంది. ఇప్పుడాలోచిస్తే గుర్తొస్తోంది. బావకి ఎదురు పడాలంటేనే హడలిపోతోంది. ఈ పరిణామాలన్నింటికీ మూల కారణం ఇదన్నమాట.

"నాతో వస్తావా?" ఓ నిర్ణయానికొచ్చినట్టు అడిగింది. అడగటమే కాదు, అదాటుని లేచి నిల్చుని అతని చెయ్యి పట్టుకుని లాగింది.

"ఎక్కడికి?" అనడిగాడతను లేవకుండానే.

"మా ఇంటికి".

"దేనికి?"

"అటో ఇటో తేల్చుకోవడానికి?"

"నీ కిష్టం లేదా?"

"ఇష్టం సంగతి పక్క నుంచు. అనలలాంటి ప్రపోజల్ ఉందనే నాకు తెలీదు".

అతని మొహం విప్పారింది. ఆమె చేతిని ఆప్యాయంగా అందుకుని పెదాలకి తాకించుకున్నాడు. "నిన్నట్నుంచీ ఏం చెయ్యాలో తెలీక నాలో నేనే ఏడ్చుకుంటున్నాను. నువ్వు మీ బావని చేసుకుంటావనేసరికి న్నాకు కోపమొచ్చింది.

"నిన్ను కాదని ఆయన్నెలా చేసుకుంటాననుకున్నావు?"

"చెప్పింది స్వయాన మీ అక్కేగా?"

"అదో పిచ్చి మొద్దు. ఆ ఇంట్లో దానికి వాయిస్ లేదు. నన్నూ తమ్ముణ్ణీ చేరదీసి ఏదో ఉద్ధరించానంటుంటాడు మా బావ. ఆ గొప్పదనంతో దాని నోరు నొక్కేస్తాడు. బహుశః ఇది ఆయన ప్రపోజలే కాబోలు" అంది జయ.

ఇద్దరూ అతని స్కూటర్ మీద జయ ఇంటికెళ్ళారు. గేటు ముందర స్కూటరాగిన చప్పుడు విని ఇంట్లోంచి ఇవతలికి పరిగెత్తుకొచ్చింది పరిమళ.

చెల్లిలు తనతో కలిసి ఇంటికొచ్చిందంటే నిన్న చెప్పిన సంగతి అతని ద్వారా తెలిసేవుంటుందని గ్రహించింది. ఆమె మొహంలోకి సూటిగా చూడ్డానికి భయం వేసింది. వీళ్ళు స్కూటరు స్టాండేసి లోపలికి వచ్చేలోపు మళ్ళీ లోపలికి పరిగెత్తింది. అవతల భర్తొచ్చేస్తాడేమో! గొడవౌవుతుందేమో! కాళ్ళూ చేతులూ ఆడ్డంలేదు. వాళ్ళు ముందు గదిలోకి వచ్చేసారు. ఆ ఒక్క గదీ వదిలేసి మిగిలిన మూడు గదుల్లోనూ అందులోంచీ ఇందులోకీ, ఇందులోంచి అందులోకీ గాభరాగా తిరిగింది. ఆఖరికి తనకి తనే నిర్ణయించుకుంది.

ఓ అమ్మాయి గుడిలో దేవుడి విగ్రహం ముందు సాగిలపడి "భగవంతుడా భారతదేశపు రాజధానిగా హైదరాబాద్‌ను చేయి!" అంటోంది.. చాలా సేపటి నుంచి ఆ మొర వింటున్న పూజారి ఆశ్చర్యంగా ఆ అమ్మాయిని చూస్తూ

"ఏమ్మా? పిచ్చి దానివా? అలా ఎందుకు మార్చాలి?" అడిగాడు.

"నేను పరీక్షలో పొరపాటున భారతదేశపు రాజధాని హైదరాబాద్ అని రాశాను!" అందుకే అంది.

సావిత్రి- హైదరాబాద్

పోపుల డబ్బీ పక్కన చుట్టిపెట్టిన పొట్లాల దారం తీసి ఇంత పసుపు పూసి తొమ్మిది పొరలేసి పేనింది. పసుపు కొమ్ము దానికి ముడేసింది. దాన్ని తీసుకుని తడబడుతున్న అడుగుల్తో వాళ్ళ దగ్గరికి వెళ్ళింది.

"వేగిరం ఇది దాని మెళ్ళో కట్టెయ్యండి" అంది అతని చేతిలో పెడుతూ. ఆమెనేదో నిలదీయాలనుకున్న జయ ఇంకేం మాట్లాడలేకపోయింది. అక్క మనసేమిటో అర్థమైంది. తన మనస్సార్థమైంది.

"మళ్ళీ ఆయనొచ్చేస్తారు వేగిరం" త్వరపెట్టింది పరిమళ.

అతనింకేమీ ఆలోచించకుండా జయ మెళ్ళో మూడుముళ్ళు వేసేశాడు. ఉత్తర క్షణాన దేవదుందుభులు మ్రోగాయి. దేవతలు పుష్ప వర్షం కురిపించారు. ఐతే అవీ దేవత వస్త్రాల్లాంటివే.

"ఇక వెళ్ళిపోండి. మీరకున్నదే జరిగిందిగా! అని వాళ్ళని అవతలికి నెట్టేసి, వాకిలి తలుపు వేసేసింది. అంతా అయోమయమే! అంతా గందరగోళమే! బ్రతుకు జీవుడాని జయా, అతనూ వెళ్ళిపోయారు. పరిమళ ఒక్కర్తీ మిగిలిపోయింది.

జరిగిందేమిటో గుర్తు చేనుకుంటుంటే ఆమెకి భయమూ అంతకన్నా హెచ్చుస్థాయిలో విస్మయమూ కలిగాయి. తనేనా, వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసి పంపింది? భర్త అభీష్టానికిది విరుద్ధమని తెలిసీ చేసింది. చేసి వాళ్లని ఒక్క క్షణమైనా నిలవనీయకుండా ఎందుకు తగిలేసింది?

వాళ్ళంతట వాళ్ళు పెళ్ళి చేనుకువొస్తే ఏ గొడవ ఉండేదికాదు. భర్త పక్కన నిల్చుని తనూ నాలుగు తిట్లు తిట్టేది. కానీ వాళ్ళలా చెయ్యలేదు. న్యాయమార్గాన అమీతుమీ తేల్చుకోవాలని వచ్చారు తనూ న్యాయమే చెయ్యాలి చేసింది సమయానికి ఆయన లేరుగాబట్టి సరిపోయింది. వచ్చి ఉంటే పెద్ద గొడవైపోయేది. అతన్తో దెబ్బలాడి ఇంట్లోంచి గెంటేసేవాడు. ఏ రాత్రో జయమీద అత్యాచారం చేసి నోరునొక్కేసి తన మరో పెళ్ళామని ముద్ర వేసేసేవాడు. ఇద్దరూ కావాలనుకుంటే రాజీపడక తప్పేదికాదు తనకి. దానికి సుతారమూ ఇష్టం లేదు. పెళ్ళైన మగాణ్ణి చేసుకోవడానికి ఏ ఆడపిల్లకి మాత్రం ఇష్టముంటుంది గనుక?

అది మాత్రం తనకి పరాయిదా? రక్తం పంచుకు పుట్టింది. ఏ దిక్కూ లేక తన పంచని చేరింది. ఎందుకనో భర్తకీ పెడబుద్ధి పుట్టింది. అతనికెదురు తిరిగితే జయకి భారం కావాలి. ఏవిటో ఈ బ్రతుకు? ఇలాంటి బ్రతుకు బ్రతకడం కన్నా చావడం మేలు? గోడకి చారగిలపడుతూ కళ్ళొత్తుకుంది.

ఇటు తిరిగి చూసే సరికి తలుపుతోసుకుని వస్తూన్న భర్త కనిపించాడు.

"వాళ్ళు.... వాళ్ళొచ్చారు. పెళ్ళైపోయింది. "గమ్మని అనేసింది. అతన్తో చెప్పాలని పెద్ద కథ సిద్ధం చేనుకుందిగానీ అతను మొహం చూస్తుంటే నోట్లోంచి ఒక్క ముక్క కూడా ఊడిపడలా.

మృష్టాన్న భోజనాన్ని నోటి దగ్గిర్నుంచీ ఎవరో లాక్కున్నంత కోపం వచ్చింది. జయ సొంపు, ఆమె ఉద్యోగపు సొగసు, జీతపు జిగి, ఆమె పేర్న ఉన్న డబ్బు ఇంపు గుర్తొచ్చాయి. వాటి మీద తను కన్నకలలు పడుగుపేకల్లా కళ్ళ ముందే కూలిపోతూ హేళన చేసాయి. వళ్ళూపై తెలీలేదు. మూలనున్నదేదో తెలీకుండా అందుకుని భార్య నెత్తిని ఒక్కటేసాడు,ఓఓముదనష్టపుదానా? నీ వల్లనే అంతా జరిగింది" అని రౌద్రంగా అరుస్తూ.

"అమ్మోయ్!" అని ఒక్క కేక పెట్టి పరిమళ తల రెండు చేతుల్లోనూ పట్టుకుని కుప్పకూలిపోయింది. రక్తం! ఒకటే రక్తం! అంత రక్తం చూసే సరికి అతని కళ్ళు చెదిరిపోయాయి. కైపూ దిగింది.

* * *

"పెద్దక్కకి దెబ్బ తగిలింది. ఆస్పత్రిలో చేర్చాడు బావ" అని తమ్ముడొచ్చి చెప్పగానే కాలూ చెయ్యి ఆడలేదు జయకి. వెంటనే భర్తతో కలిసి హాస్పిటల్‌కి పరిగెత్తింది.

"ఎలా తగిలిందే?" తలకి పెద్ద కట్టుతో మంచం మీద నీరసంగా పడుకునున్న అక్కని చూడగానే కడుపు చెరువై పోయి, ఏడుపు గొంతుతో అడిగింది. అర్థమౌతూనే ఉంది, ఎలా తగిలిందో అయినా అడిగింది.

"అదీ... అదీ...." తడబడిపోతుంటే పరిమళే అందుకుని చెప్పింది. కాలుజారిపడ్డానని తనని చెల్లెలి దగ్గిర యాగీ చెయ్యకుండా బైటపడేసిన భార్య పట్ల అతని మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

కాలు జారిపడితే తలెందుకు పగిలిందని ఆరాలాగలేదు జయ. బావకు అలాంటి ఉద్దేశం ఉందని తనతో ఎప్పుడూ అనలేదు. అక్కతో అన్నాడేమో? అదీ తనకి చెప్పలేదు. అతన్తో తనకీ వాళ్ళకీ మధ్యని మంచితనపు తెరింకా చిరగలేదు. దాన్నలాగే వుణ్ణిస్తే పోలేదా అనుకుంది జయ. "దీనిదంతా దూకుడే?" అంది చివరికి.

"ఇహిహీ?" అన్నాడు చెలం.

అక్క ఆయన్తో తమ పెళ్ళి జరిగిన వైనం గురించి ఏం చెప్పిందో? ఈ బెదురుగొడ్డు ఏమీ చెప్పి ఉండదు. అన్ని మాటలు దీనికి రావు. అదీగాక నేనే పెళ్ళి చేసి పంపానని అనలే చెప్పుకోలేదు. అందుకే ధైర్యంగా అనేసింది "నిన్న దేవీ సమక్షంలో అనుకోకుండా మా పెళ్ళి జరిగిపోయింది బావా? ఇంటికొస్తే అక్క నువ్వేమంటావోనని హడలిపోయి తరిమేసింది. ఇపుడేనా ఆశీర్వదించు బావా?" అని అతని చెయ్యి పట్టుకుని చప్పుని వంగి చెలం కాళ్ళకి దణ్ణం పెట్టేసింది.

అంతా అయిపోయాక నేనెందుకు చెడ్డవాణ్ణనిపించుకోవాలనుకున్నాడేమో చలం, ఇంత పొడుగుని ఆశీర్వదించేసి అంతలావుని దీవించేసి, నవదంపతుల్ని ఇంటికి రమ్మని పిలిచాడు.

ఈయనింత మంచివాడుగాబట్టే ఏం జరిగినా సర్దుకుపోతున్నాడనుకుంది, పరిమళ మనసు కుదుటపడ్డా, ఇంకా అలసట తీరక కళ్ళుమూసుకుంటూ. ●